

పార్వతి యనుతాపము

రాయసం వేంకటశివుఁడు గారు

౧. పార్వతీభాయి

కావున నుచితములగు నా
కావెంటం గొలిచి తిరుగునప్పుడు మితభా
షావిరచనమును వ్రతసం
భావనమును గౌరవంబుఁ బాపభయంబున్.

—భారతము.

గాంధినగరమున పర్ణశాలలలో విడుద లేర్పఱుచుకొని దేశీయమహాసభాసభ్యులును ప్రేక్షకులును నిద్రావస్థయం దుండిరి. పగలెల్లను క్రొత్తక్రొత్త విషయములు చూచుటను, చిత్రములగు నుదంతములు వినుటను, నడయాడుట నుండెడివారికి నిద్దుర వేగముగనె లభించుచుండును. కాని సుషుప్తి కలవగువారు లేకపోలేదు. మైమఱచి నిద్రించువారిసొత్తుల నపహరింపఁ జూచువారును, శ్వాసకాసాది వ్యాధులకు లోనగువారును, కంటికిఁ గూర్కు రాక, గడియలు లెక్కపెట్టుకొనుచు, రాత్రి గడపుదురు. ఇంక నేదైన గాఢమనోవ్యథచేఁ బీడింపఁబడువారికి, రేయుం బవల్లొక్కటియే. వేదాంతులమనస్సువలె, వారిదియు దేశకాలనిమిత్తముల నతిక్రమించి, లక్ష్యమందు సుస్థితమై, చలింపకుండును!

కూర్కు లేని కన్నుఁగవగల పార్వతీభాయి పైపేర్కొనఁబడినవారిలో నెవ్వరని నిర్ణయింపఁగలము? ఆమె యేదేశపు చేడియయో కలసిమెలసి యుండు స్త్రీప్రేక్షకులును, ఐచ్ఛికసేవకురాండ్రును నే చెప్పలేకున్నారు! పార్వతీభాయియొక్క స్వచ్ఛమగు తెలుఁగునుడికారమును బట్టి యామె యాంధ్రస్త్రీ యని నలుగురును దలపోయుచున్నను, హిందీమాటాడుట మొదలుపెట్టినా, ఆమె కంఠము మాఱిపోయి, ఏయుత్తరదేశపు వనితయో యని వినువారు తలంపకపోరు! ఇదిగాక, యామె తెలుఁగు స్త్రీలవలె నగలుపెట్టుకొనక, సామాన్యముగ మేలుముసుఁగు వైచికొని మితభాషిణియైయుండును. దీనినిబట్టి యీయువిద ప్రయాగప్రాంతపు కాంతయని కొందఱును మహారాష్ట్రమానిని యని మఱికొందఱును నూహించుచుందురు.

ఈవరవర్ణిని వయసెంతయో చెప్పుట సులభము కాదు. స్త్రీలవయోనిర్ణయము చేయుట లోకములో పురుషుఁడు విడఁదీయఁగల కఠినసమస్యలలో నెల్ల కఠినమైనది! మేధావంతులగు మామిత్రులొకరు దీర్ఘాలోచనము చేసి, యొకానొక స్త్రీ యామె కొమరితయంత లేఁబ్రాయంపు నెలఁతయని నిర్ధారణచేసిరి! ఇంకొక బుద్ధిమంతుఁడు మాతను బుత్రికయనియును, పుత్రికను మాతయనియును దలపోసి, పిమ్మటవారితో జరిగిన సంభాషణమునఁ దన పొరపాటు గ్రహించి తత్తరపడసాగెను! కోమల ముఖకాంతినిబట్టి పార్వతీభాయి యౌవనస్థయని పరిగణింపవలసియున్నను, ఆముదిత ధరించెడి మొఱకు వస్త్రములు, వైరాగ్యనిష్ఠయును, ఆమహిళామణి ముప్పదివత్సరముల స్త్రీయని నలుగురకు స్ఫురింపఁ జేయుచుండును.

పార్వతీభాయి మితభాషిణియు విరాగిణియునని యనుకొందమా? కాదుకాదు. ఆమెలఁత మితభాషిత్వము, వృథాప్రలాపములదెసకుఁ బోకుండ నాలుక నాఁపనేర్పు అనుకొన్న నియమబంధనమెకాని, ఆపన్నుల నోదార్చునపుడును, దుష్టులకు హితబోధన చేయునపుడును నోరాడకుండఁ జేయు ప్రతిబంధముగాదు. ఆవెలఁది వైరాగ్యమంతయు, మనసును క్షుద్రవిషయములదెసకుఁ బోనీకుండఁ జేయునదియెకాని, పరులకష్టములకుఁ దాను వగవకుండునట్టును, వారి యానందమునఁ బాల్గొనకుండునట్టును చేసెడి సంకిలిగాదు!

జవ్వనులగు సాధారణైచ్ఛిక సేవకురాండ్రవలె పార్వతీభాయి, చూపరకనుల నాకర్షించుటకై మెఱయుచుండు డవాలిని తెల్లనిచీరమీఁద భూషణప్రాయముగ

ధరించి యిటునటు తిరుగుచుండునట్టిదిగాదు. మెడలో వైచుకొనిన రంగుగుడ్డపట్టి తానుజేయవలసిన యుత్తమ ధర్మములు దనకు సర్వదా స్ఫురణకుఁ దెచ్చుచుండెడి గుఱుతనియె యామె భావించును. తన యధికారౌన్నత్యము, మానవసేవచేయ తనకవకాశములు గల్పించు నొక యుపకరణ విశేషముని తలంచు నాసుదతి, అవిచూచుకొనియేల మిడిసిపడుచుండును? మహాసభ జరుగునంతసేపును, పార్వతీభాయి, స్త్రీప్రతినిధులయొక్కయు ప్రేక్షకురాండ్రయొక్కయు సేవయందె కృషిసల్పును. చోటు దొరకక యల్లాడుచుండెడి స్త్రీ కనుపట్టినతోడనె, యామె కూర్చుండుటకుఁ బార్వతీభాయి యెడవు గల్పించును. నోరారిపోవు బాలిక కాపుర్యావతి మంచినీరు దెచ్చి యిచ్చును. పోరు పట్టియేడ్చి తల్లిని సభలోని ప్రసంగము విననీయకుండఁజేయు శిశువు, పార్వతిభాయి యెత్తుకొనినతోడనె నేడదేఱును. ఎపుడు పార్వతీభాయి నోట రెండుమెతుకులు వేసికొనునో యెవరును గనిపెట్టలేరు. ఇఁక భోజనశాలలోనికి వచ్చెడి భామినుల కుపచారములు చేయుటకె యామె కరములు వినియోగపడుచుండును. రాత్రులందు ఐచ్ఛికసేవకురాండ్రు ప్రేక్షకులవలెనే హాయిగ నిదురించుచుండినను, పార్వతీభాయి మాత్రము తాను విశ్రమించునట్లుండియు, కన్నుల నంపటి సంరక్షణ మారయుటకె విప్పియుంచును.

దేశీయమహాసభ కాకినాడలో జరిగిన దినములలో పార్వతీభాయి కన్నులు రాత్రులు నిద్దుర నెఱుఁగకుండుటకుఁ గారణము పూర్తిగఁ దెలిపితిమా? లేదు లేదు. జీవితము పరోపకారము చేయుటకె యేర్పడిన దీక్షాకాలమని గుర్తెఱిఁగినవారు, జనులసుఖదుఃఖములు తమవనియె భావించుచుందురు. సామాన్యుల హృదయముల సర్వదా యాకర్షించెడి యాహారవిహారాదికములు, పరోపకారపారీణులకుఁ దృణప్రాయములు. వారికిఁ బ్రియమగు భోగములును లేకపోలేదు. ధర్మనిర్వహణమే వారి కత్యంత సంతోషకారణము. పగలెల్లను కార్యదీక్షలో డస్సి, రాత్రి యొకింతసేపు నిద్రావస్థలో నేదదేఱ శరీర మెంత యపేక్షించినను, స్వామికార్యాచరణమున రేయుంబవళ్లలో భేదము గల్పింపఁగూడదని పార్వతీభాయి తనదేహమునకు హితబోధ చేయుచుండును! కలుషరహితులందు పగటిపూఁట సహాయ మంత గొప్పదిగా నెన్నక, చీకటిచేతను, నిద్రచేతను జనుల పరులఁ దమ్ము నెఱుంగకుండఁజేయు రాత్రిపూఁటయే పార్వతీభాయి జాగరణము చేయఁబూనెను!

పాఠకుఁడా! పార్వతీభాయి యాకారమును జాగరూకతతోఁ బరిశీలింపుము. 'ఏమి! యాకలికి కన్నులో కింత చెమర్చుచున్నవే! నీటి బిందువులు కనుకొలుకులనుండి రాలుచున్నవి. లోకసేవయే జీవితంపు పరమార్థముగ నిశ్చయించుకొనిన యాకాంతకు సొంతకష్టములున్నవా? పరమ విరాగిణియు, పవిత్రశాంతమూర్తియునగు పార్వతీభాయి మనస్సు నిటు గలంపఁగల పూర్వపు పాపకృత్యములేమైన నామెతలంపునకు వచ్చినవా?

ఔను. పార్వతీభాయి తనపూర్వపు సంగతులొకింత జ్ఞప్తికిరాఁగా పరితపించుచున్నది. తరతరములనుండి భూగర్భస్థముగుటవలనఁ గఠినమగు కాఠిన్యమును దాల్చిన నేలబొగ్గు, వేలకొలఁది సంవత్సరములకుఁ బూర్వమొకప్పుడు, కోమల పత్రపుష్పలతాభరితమైన మనోహర వృక్షమే! లఘువైన యంగారపదార్థము నేల పాదుకొని చిరకాలమునకుఁ బిదప కఠినతమమగు వజ్రముగఁ బరిణామమొందుచున్నది! పార్వతీభాయి పూర్వపు వృత్తాంతమెఱుంగనివారికి, పార్వతీభాయి నిక్కంపుఁ బ్రకృతిఁదెలుపడనేరదు!

౨. పార్వతీ విశ్వనాథులు

చ. ఇది గడుముద్దరాలు పను లేమియుఁ జేయఁగనేర దెంతయున్. —భారతము.

విశాఖపట్టణమండలమందలి నేరెడువలస జమీందారు దివానగు సింహాచలముగారు పార్వతి జనకుఁడు. అధికలోకానుభవముగల దివాను, తన యేకైక పుత్రికయగు పార్వతికి మంచివరుని వెదకుటకై కృషిసల్పి, తన యల్లునికడ నుండవలసిన ముఖ్యలక్షణములు విద్యాధికతయు, గుణాధికతయు నని నిర్ధారణచేసికొని, అట్టి యువకుఁడు లభించినయెడల భాగ్యభోగములకేమియు వానికిఁ గొఱంతలేకుండఁ జేయ సమకట్టెను. ఇటులుండఁగా, ఆనాఁడు పట్టపరీక్షలో విజయము నొంది సుగుణములచే నొప్పారెడి యువకులలో విశ్వనాథము పేరెన్నికగాంచియుండుటచేత, అతని నివాసము దూరస్థమగు కొండకోట

సీమయు, అతని తలిదండ్రులు సామాన్య స్థితిమంతులు నైనను, సింహాచలముగారు పార్వతిని విశ్వనాథమున కిచ్చి పరిణయము జరిగించిరి. అది యేమి కాలవిపర్యయమోకాని, యీక్రొత్తసంబంధము, ఉభయ కుటుంబముల వారిని నూతనస్నేహమునఁ గలుపునూత్రమగుటకు మాఱుగా, వారి కిదివఱకు లేని వైరములఁగల్పించు దుష్టమంత్ర ప్రయోగమయ్యెను! ఆగర్భశ్రీమంతురాలగు కోడలు తమ గృహమును లక్ష్మీయుతముగఁ జేయునని సంతసింపవలసిన కొండవీటివారు తమ క్రొత్తబంధువుల కలిమికిఁ గంటకించుకొనసాగిరి!

పుట్టినింటివారిసిరి చూచుకొని కోడలు తన్నుచిత రీతి గౌరవింపదని యత్త సణుగుకొనుచుండును. మామ భాగ్యమునఁ బుత్రునకు తన సంగతి దివిటీక్రింద దీపమగునని తండ్రి యంగలార్పఁ జొచ్చెను. జననీజనకు లహర్నిశమును జేసెడి విపరీతబోధనములు క్రమక్రమముగఁ దలకెక్కిన విశ్వనాథము, భాగ్యవంతుఁ డగు మామవలనఁ దనకుఁగలుగఁబోయెడి ధనగౌరవములు, విద్యాసౌందర్యములుగల యర్ధాంగివలనఁ జేకూఱెడి సౌఖ్యసంపదలును పరిగణింపక, అత్తవారియెడల నకారణ వైరభావమును బూనియుండెను.

ఇంకఁ బార్వతి తల్లిదండ్రులన్ననో, విద్యాబుద్ధులం దగ్రగణ్యుఁడగు నల్లుఁడు లభించెనను సంతోషము పెండ్లియుత్సవములతోనే యంతరించిపోఁగా, తమవియ్యాలవారి పేదఱికమును గుఱించియే యనుదినమును దలపోయుచుండిరి! కొండవీటిసీమ నిఁకఁ బుత్తూరు కొండవీటి చేఁదాడువలెఁ దుదిలేని దారిద్ర్య మనుభవించునని తల్లి పలవింపుచుండును. సకలైశ్వర్యములతో సుకుమారముగఁ బెరిగిన తన ముద్దులపట్టి రిక మోటు పడమటివారియింట కటకటఁబడునని తండ్రి వగచెను. అత్తవారిని గొంచెపఱచు నిట్టి క్రించుదనపు మాటలు వినుచుండిన పార్వతి, యట్టి నిఱుపేదల యింటికాఁపురమును గంటక సదృశముగ భావించుట అక్కజము గాదు!

౩. పతిసతుల సంభాషణము

"అలుకం జెందిన యట్టి కాంత లుచిత వ్యాపారముల్ సేతురే?"

పారిజాతాపహరణము.

ఒకనాఁటిరాత్రి విశ్వనాథము సెలవువలన పట్టణమందలి మామగృహమున కుర్చీలోఁ గూర్చుండియుండెను. సకలవైభవములతో నాసౌధ మొప్పుచున్నను అతని హృదయము తన కొండవీటిసీమ కుటీరమునందె లయించియుండెను. తనవిద్యాప్రజ్ఞల కనువగు నుద్యోగ మిప్పించుటకు మామ సిద్ధముగనున్నను, నూతనముగఁ దానారంభించిన యుద్యమములవంకకే యాతనిదృష్టి వాఱుచుండెను. పూర్వము తనయత్తవారినిగుఱించి తన యింటఁ జెప్పుకొనునంత ఘోరముగ నచటి పరిస్థితులు లేకున్నను, స్వగృహమందలి స్వతంత్రజీవనమునందే యాతఁడపేక్ష గలిగియుండెను. అత్తమామలు ప్రత్యక్షరాక్షసులుగాక తన శ్రేయోభివృద్ధులు గోరుచుండెడి సుజను లేయని యతఁడు గ్రహించినను, వానిమనస్సు తలిదండ్రులయొద్ద సుఖజీవనమునకే మఱలెను. విద్యారూపసౌభాగ్యములతో నలరారెడి భార్య ఎంతటి వినయవిధేయతలు గల సాధ్వియైనను, సకలైశ్వర్యములుగల మామయింటఁ గాఁపురమునకంటె, స్వగృహమందలి నిరాడంబర జీవనమె మేలని యాతఁడు తలంచెను!

ఇట్టియూహలలో మనస్సు మగ్నమై యుండుటచేతనే, ఇపుడు లోనికివచ్చి నిలువఁబడినభార్య యాకారము కన్నుల కొకటిరెండునిమేషముల వఱకును విశ్వనాథమునకు గోచరముకాలేదు. అంతఁదనయెదుట సౌందర్యదేవత యపరావతారమువలె నిలిచియున్న సతీతిలకమునుగూర్చి యిదివఱకుఁ దమవారు చెప్పుకొను సంగతులు స్ఫురణకు రాఁగా వానికి విస్మయము గలిగెను. లావణ్యమునకుఁదీసిపోని సౌజన్యము, ఆపాదమస్తకమును ఆ కాంతయం దాతని కనులకుఁ బొడగట్టెను. "ఆహా! ఇట్టి విగదా లోకములో భ్రమప్రమాదములు! పూలమాలను జూచి పామనుకొనునట్లు జను లితరులనుగూర్చి యపవాదములు నుడువుదురు! ఈ లలనామణి సుగుణములు మెచ్చుకొననివా రెవరుందురు? ఇది ముఖ్యముగఁగని పెట్టియూవం దింపవలసిన నా జననీజనకులె, పార్వతిని గుఱించి విపరీతాభిప్రాయ మూఁదియున్నారు!" అని యతఁడాశ్చర్యపడెను. అంతట భార్యాభర్తల కీసంభాషణము జరిగెను.

విశ్వ:—"పార్వతీ! మీ జననీజనకులు సజ్జనులగుట కెంతో సంతోషించుచున్నాను."

పార్వ:—"రాక్షసులవంటకు వారు కొండవీటి సీమవారు కారులెండి!"

విశ్వ:—"ఇదివఱకు మీవాళ్లు దుష్టులనియే నే దలంచితిని గాని, యిపుడు నిజము తెలిసినది. కొండవీటి సీమలోఁగ్నాడ సౌజన్యము నీ కన్నుల కగపడఁగలదు. లోకప్రతీతిచేఁగాక యనుభవముచేతనే మనము ఏవిషయ మేని నమ్మవలయును."

పార్వ:—"అలాటి యనుభవము నాబోటివాళ్లకు సాధ్యమా?"

విశ్వ:—"నా యుద్యోగమునకై మీ తండ్రి యెంతో పనిచేయుచున్నారు గాని, స్వతంత్ర జీవనము నందే నాకు వాంఛ."

పార్వ:—"ఎవరును వెనుకటిగుణము మానలేరు! మీకు మీదేశమునకు వెళ్లిపోవలయునని యున్నదా?"

విశ్వ:—"నేనొక్కఁడనెకాదు, మనమిద్దరమును! అక్కడ లోకోపకారకరములగు పనులు మన మెన్నియో చేయవలసియున్నది. మీపుట్టినింటిలోవలె నైశ్వర్యములు లేకున్నను, నిజమగు సంతృప్తిని సంతోషమును బొందఁ గలము!"

పార్వ:—"అలాటి ప్రదేశములలో మీరు సుఖించిన సుఖింతురుగాని, నే నుండలేను!"

విశ్వ:—"మా యింటికివచ్చుటకు నీకేమి కష్టమో చెప్పుము?"

పార్వ:—"మీది ఘోరదేశము. నిర్జలప్రదేశము. నిర్దయాత్ముల యావాసము!"

పార్వతి యిట్లు మాటాడుచుండఁగ విశ్వనాథ మెన్నఁడును వినలేదు! ఆమెఁ లఁత మితభాషిణియు శాంత స్వభావురాలనియు నాతని తలంపు. ఐనను, ప్రసంగ ధోరణిని మెల్ల మెల్లగ నాకాంతకుఁ గోపము హెచ్చి ఆ సుందరవదనమునందలి పసిఁడివన్నె యరుణకాంతియై, ప్రియునికోపము నాశ్చర్యముగ మార్పఁగా, మందహాస ముతో విశ్వనాథము, "పార్వతీ! ఏల యిట్లు మమ్మింద ఱిని చుట్టపెట్టి చెండాడుచున్నావు!" అని యామెను శాంతిపఱుప నెంచి చేయి నిమురుచు, "కోమలీ! కోమల హస్త మునకుండు మృదుత్వము హృదయమునకు లేకపోవుట ఎంతచిత్రము!" అని పలికెను.

పార్వ:—"ఈమృదుత్వమునకుఁ గఠినత తెచ్చిపెట్ట వలయునను వారిదయ యంతచిత్రము!"

విశ్వ:—"నీకోపమునకుఁ గారణమువిప్పి చెప్పుము?"

పార్వ:—"కష్టము తెలియంగక పెరిఁగిన నేను మీదేశమున గాసిఁబడఁజాలను. లేమియు శ్రమయు నాకు ఆగర్భశత్రువులు!"

విశ్వ:—"అట్లైన, మాతల్లి మాటలు నిజమే. ఆ ముసలామె కిదియే తుదిదెబ్బ!"

పార్వ:—"ముసలామె యేమైననుసరే! నేను మీ దేశమున నడుగుపెట్టఁజాలను!"

౮. పార్వతి మనోనిశ్చయము

"నెన్ను ని గుఱించి యిటుఁ దప మున్నదాన!"

—ఉత్తరరామాయణము.

మఱునాఁడు నేరేడువలస పట్టణమున, దివాను గారియల్లుఁడు ఎవరికిని జెప్పక వెడలిపోయెనని జనులు చెప్పుకొనిరి. మామగారింటనుండ నిష్టములేక లేచిపోయె నని కొందఱు, భార్యమీఁదఁ గోపపడి యిలు వెడలెనని మఱికొందఱు నూహించిరి. పార్వతి దుశ్శీలయని యెవ్వ రనఁగలరు? ఐనను, ఆగర్భశ్రీమంతురాలనని యామెకొక గర్వము. సంపద మంచిదే. పరిశ్రమము చెందినవారికి మాత్రమే యది మేలుచేయును. ఇతరులకది దారిద్ర్యమున కంటె నధికముగ చెఱుపుచేయును. కలిమి కష్టమున కోర్వదు. కోపమునకుఁ బుట్టినిల్లు. గర్వము నుగ్గుపాలతోఁ బెంచును. చింతచచ్చినను పులుసుచావదన్నట్లు భాగ్యము నశించినను, తత్సంపర్కదోషమున సంక్రమించిన దురాగ్రహాదిదుర్గుణములకు జనులు అగ్గమై యుందురు. ఐశ్వర్యమా! నీవిచ్చెడి సౌఖ్యములు క్షణభంగురము లైనను, నీవు కొనివచ్చు దుర్వ్యసనములు శాశ్వతములు! వానిబారి నుండి తప్పించుకొనుటే దుస్తరముగఁ దోఁచునపు డిఁక వాని నిర్మూలనము చేయఁ గడఁగుట యెట్టి దుస్సాధ్యమగు కార్యము!

ఇఁకఁ బార్వతి మనఃపరిస్థితు లెటులున్నవో కొంత పరిశీలింతము. మఱునాఁటి యుదయమున పడక విడిచి

పార్వతి తపస్సు.

భూతిపూసిన నింత వాడమెడఁ దను కాంతి, తొడుప నెంతటి మెఱుంగ గడరియున్నొ
వంది కందిన నింత వఱలెడు ముఖరోచు, లెలమిన యెంత సల్లలిత మగునొ
పాలయింపకయు నింత వెలిఁగెడుఁ జూడ్కు,లల్లార్చిన నెంత రమ్యంబులగునొ
జడలు గట్టియు నింత సక్కనైనది వేణి, దీర్చిన నెఱు లెంత క్రొదేణి యగునొ
యీడ విడిచిన మేఁదీగ యింత నయము, గలిగి యున్నది వాలిక కలిగెనేని
నెంత నవకమై యుండునో యింతి కనుచు, శివుఁడు గిరిరాజసుత విశేషించె నర్థి.

—నన్నెచోడుని కుమార సంభవము.

తెమనపుడు పార్వతివీనులకుఁ గడచినరాత్రి భర్తతోడి తన ప్రసంగము వినవచ్చుచున్నటు లుండెను. సంభాషణ మాకస్మికముగ నిలిచిపోవుటకుఁ గారణమేమా యని యావిడ యాశ్చర్యపడెను. పతి యాగ్రహమె దీనికిఁ గారణమని కొంతతడవువఱకు ఆసుందరికి స్ఫురించలేదు. తాను గట్టకడపట వచించిన పరుషవాక్యములు ఆయనకుఁ గోపము తెప్పించెనని యిప్పు డామె తెలిసికొనెను. మాననీయమగు జననిగుఱించి పుత్రునియెదుట కఠోరమగు నిట్టిమాటలాడుట తప్పిదమని యా కాంత గ్రహించెను. చీఁకటియుండఁగనే యెప్పుడో యిలువెడలిపోయిన పతి, ప్రొద్దెక్కినను రాకుండుట మాఱి, తన దుడుకువనమె దీనికి గారణమని పార్వతి కిపుడు బోధపడెను. అదివఱకు విచారమెఱుఁగని యామానిని మనస్సు ఆదినమున వ్యాకులత పాలయ్యెను. "అత్తకేమైనను నాకేమి?" యను తనమాటలు పార్వతిచెవులకుఁ బలుమాఱు దవులుచున్నటు లుండెను!

ఆదినమున నేకాదు మఱునాఁడును విశ్వనాథ మింటికి రాలేదు. తపాలజవా నంత యొకయుత్తరము తెచ్చి యిచ్చెను. అది పార్వతిపేరవచ్చెను. మిక్కిలి తత్తరపాటుతో నామె దానిని విప్పిచూడఁగా నం దిట్టులుండెను.

రెయిలుమార్గము.

చి. సౌ. పార్వతికి,—

నీశ్రేయస్సును గోరియె నీకీయుత్తరము వ్రాయుచున్నాను. ధర్మాచరణ మింకొకసారి నీకు జ్ఞప్తి చేయుచున్నాను. సరియైన యనుతాపమే ముందుదారి చూపి నీకు సంసారసుఖము నీయఁగలదు. నాపరదేశవాసదీక్ష నీసాన్నిధ్య సంప్రాప్తివలననే పరిసమాప్తిఁ నొందఁగలదు. పాదము దేశాటనమునందున్నను, మనస్సు నీయభివృద్ధినే కాంక్షించుచుండు నీహితుఁడు—విశ్వనాథము.

నాఁటిరాత్రి తన తొందరపాటువలన పతికీనిర్బంధ దేశసంచారము సంభవించుటకాయింతి యెంతయు వగచెను. పరిస్థితు లిట్లగునని యాకలికి కలలోనైన ననుకొనలేదు. సాంసారిక సౌఖ్యమున కువ్విళులూరుచుండిన యాచెలువకు పతివియోగమునకుఁ జెప్పవలదిగాని యాశాభంగము గలిగెను. తన మనోవ్యాధికి నెటులో మామయింటఁ గాపురమున కొడఁబఱుపఁగలనని యాయంగన యనుకొనుచుండెడిది. తనపలుకులకు పతి యింత యలుగుననియును, వానియలుక యిట్లు పరిణమించుననియును, ఆచాన యనుకొనలేదు. బాల్యమునుండియు నిరంకుశప్రవృత్తియు, సుఖాపేక్షయు జీవితధర్మములుగఁ దలంచుచున్న యాచేడియ, ఈప్రాతికూల్యమువలన భగ్నమనోరథయై, లోకములో నెవ్వరికిని గష్టములు తప్పవని తెలిసికొనెను.

చిరకాలమిత్రమగు సుఖాపేక్ష నొక్కపెట్టునఁ గోసివైచుట ఎవ్వరికిని సాధ్యముకాదు. ఆరాత్రి నిద్రయందును పార్వతి మనమున కలవరమతిశయించి యుండెను. మఱునాఁటి సాయంకాలము తిరిగి తపాలజవాను తెచ్చిన యుత్తరమొకటి పతికి వ్రాయఁబడి యుండుటచేత, పార్వతి యది విప్పి చూడఁగా, అందు కొండవీటిసీమ వర్తమానములుండెను. కుమారుని కష్టములకుఁ దల్లి బెంగపెట్టుకొని మంచమెక్కి యుండుటయు, విశ్వనాథము గ్రామాంతరము పోవుటచేత నతఁ డచట నారంభించిన కార్యములకు భంగముగలుచుండుటయు, వార్ధక్యదశనుండిన మామ వీనినెల్ల సమర్థింపనేరక, ఒంటరిగనైన వేగముగఁ దనయుని యింటికి రమ్మనికోరుటయు దాని యందు వ్రాయఁబడి యుండెను. ఆమానిని మనోనేత్రమున కీజాబులోని సంగతులు తనకర్తవ్యము నొకపెట్టున మెఱుపుమెఱసిన చందమున స్ఫురింపఁజేసెను; ఆరహస్యమును గ్రహించిన యాసాధ్వి, సందియములు తొలఁగిపోయి, ఆనందభరితయయ్యెను. కష్టమా! ఇట్టిసహాయకారివగు నిన్నేలజనులు నిష్కారణముగ నిందింతురు!

దివానుసింహాచలముగారు సాయంకాలము ఉద్యోగస్థానమునుండి వచ్చినవెంటనే కుశలప్రశ్న చేయుటకై, కొమారెగదిలోనికిఁబోయి, యామె చాలసందడిఁ బడుచుండుట కచ్చెరువొందిరి. ఎచటికో దూరప్రయాణము చేయుటకై పార్వతి మూటయు ముల్లెయుఁ గట్టుకొనుచుండెను. వలదని తల్లిదండ్రులెంతచెప్పినను పుత్రికవారిమాట వినక, యారాత్రి పయనమయ్యెను.

౫. ధర్మాచరణము

క. ఆవెలఁతనీయముకువిషయ
సామ్యగిరి వ్యదుగభీర సంభాషణల

మామయు న త్తయు సంతో
షామృతమునఁ దేలి రంతరంగములఁ దగఁగ్.

మహాభారతము.

మనుజుఁ డీలోకమున నిర్వర్తింపవలసిన యుత్కృష్ట కార్యములలో నెల్ల ధర్మాచరణమే యుత్కృష్టమైనది. విధినిర్వహణము తనను సేవించువారిని, తక్కిన ధర్మములవలె లేనిపోని తర్కమీమాంసలకు లోనుచేయక, వారికి నిస్సందేహమగు తరణోపాయమును జూపించును. కష్టములను పలాయితము గావించును. తనభక్తులకు సౌఖ్యము నొడఁగూర్చి, స్వర్గమును భూతలమునఁ బాదుకొల్పును. విధికార్యనిర్వహణమునకుఁ దొడంగినకాళ్లకు ముండ్లు గ్రుచ్చుకొనవు. దుస్సహములైన ప్రచండభానుకిరణములు శీతకరుని చలువవెలుఁగులై హాయినొసంగును. దుఃఖజనకమగు పరిస్థితులు, సిగ్గుచేఁ దలవంచుకొని ధర్మాచరణదీక్షఁబూనువారి కడనుండి, తొలఁగిపోవుచుండును.

కొండవీటిసీమయందలి మామగారి గృహముపార్వతిసొచ్చి యిప్పటికిఁ గొన్ని నెలలైనది. క్రొత్తగా వచ్చిన దినములలో పార్వతినందఱును జాలిముఖముఁజూచుచుందురు. ఈభాగ్యవతి మూలమునఁగదా ! తమ ముద్దులకొమరుఁడు పరదేశముల పాలయ్యెనని యత్తమామ లీసడించుచుందురు. ఈసుందరికిని దమకును రూపవిద్యాభాగ్యములందుఁగల తారతమ్యమునుబట్టి సవయస్కలగు యిరుగుపొరుగు చేడియలు పార్వతియనిన పెడమొగము పెట్టుచుందురు. ఆనాతిధరించు మిలమిలమనుసీమనూలు చీరకాంతులు, మొఱకు కోకలుగట్టుకొండవీటి కోమలులకన్నులకు నూదులవలెఁ దగిలెను. ఈవిశాఖపట్టణపు సుందరి ధరించునగలును, వాడు సబ్బులు సుగంధద్రవ్యములును, ఆపల్లెటూరి యిల్లాండ్రకేమియునచ్చక, పార్వతి తన యైశ్వర్యమును జూచుకొని విఱ్ఱవీగు వగలాడియని వారు భావింపఁ జొచ్చిరి!

పార్వతి మనస్సునందెట్టి పరితాపము గలుగుచున్నదో యాసుదతులకేమి తెలియును? పార్వతి యంతగ నెవరితోను మాట్లాడు బాలకాదు. తనదురవస్థకు లజ్జపడి యామానిని మఱింత మితభాషిణియయ్యెను. నిలుకడమీఁద పార్వతి నిజస్వభావము వారికిఁ దెలిసినది. తనకుఁ గోడలుచేయు సపర్యలు కడుపునఁ బుట్టిన కూఁతురైనఁ జేయదని యత్తచెప్పసాగెను. ప్రాఁతకోఁతలందును, కుటుంబకార్యనిర్వాహకత్వమునందును, పార్వతి మామకుఁ గుడిభుజమయ్యెను. ఆపుణ్యవతి తమ యిలుసొచ్చినప్పటి నుండియుతిరిగి పాడిపంటలయందు తమకుఁగొఱంతలేకున్న దని యాగృహస్థులు గ్రహించిరి. పార్వతి యత్తయొడఁ గనపఱుచునత్యాదరమువలననే, కాటికిఁగాళ్లుచాఁపుకొనిన యాముదుసలి ముత్తైదువ, మరల యౌవనవతియగుచున్నదా యనునట్టుగ మిసమిసలాడఁ జొచ్చెను! ఆమె కిపుడు పార్వతి బహిఃప్రాణము. తమకుఁగోడలే కొడుకు కూఁతురునని యావృద్ధాంగన నలుగురికిని జెప్పుచుండును. అరవిందమువలె నున్నదనము నరుణకాంతియు గలిగియుండు పార్వతి పాణితల మిపుడు, ఇంటిపనులు నిర్వర్తించుట చేత గట్టిపడుట కత్తయెంతయు వగచి, కష్టపుపనులు చేయవలదని కోడలి నివారించి, అవి తానే చేయుచుండును. తమకోడలు సత్కులమున జనించిన యోగ్యురాలని గ్రహించి యామె తమ వియ్యము వారిని గౌరవింప నారంభించెను.

గృహకృత్యములు చూచుకొనుటయే కాక, భర్త యాప్రదేశమం దారంభించిన ఘనకార్యములు కొనసాగింపవలయుననియు పార్వతి యాశయము. విశ్వనాథము గ్రామమున లేకుండుటచే క్షీణింపఁదొడఁగిన రాత్రిపాఠశాల హిందీప్రచారములను పార్వతి పునరుద్ధరింపఁ జూచెను. ఖద్దరువస్త్రనిర్మాణమునకుఁగూడఁ బ్రోత్సాహము కలిగించెను. తనకదివఱకుఁ దెలియని నూతనోద్యమములందుఁ జొచ్చుట కాసుందరి వెఱఁగందక, తనప్రియునకుఁ బ్రియమగు సత్కార్యములు దనకును నాదరణీయములె యని చెప్పెను. మృదువగు చీరలు ధరించుచుండిన యామృదులాంగి, తన ముద్దినుసు చీరల నిపుడు మూలవైచి, ముదుగుస్వదేశవస్త్రములు గట్టుటకుఁ గొంకకుండెను. హిందీభాషాపరిజ్ఞానములేని యాబాల, ఆ గ్రామవాసినులకుఁ దానే యాభాష నేర్పఁబూను టెంతటి సాహసము! తాను జెప్పినచొప్పున నాచాన చేయఁగలుగుట యందలి రహస్యమేమనఁగా, స్వయంకృషిచే ప్రాతఃకాలమునఁ దాను హిందీ నేర్చుకొనుచు, మధ్యాహ్న సమయమునఁ దనయింటికివచ్చు బాలల కామె పాఠము చెప్పుచుండును. తనకుఁగల యభినివేశమువలన గట్టి నూతనోద్యమములును

[illegible] 18–10–84

చిరకాలానుభవముగల వారివలె నాసాధ్వి సాధింపఁ గలిగెను. వేయేల? ఆప్రాంతములందు వ్యాప్తిలోనున్న యున్నతోద్యమములలోఁ బార్వతి పాల్గొనుచు, దేశసేవకురాండ్రలో నొకతెయని యాకె పరిగణింపఁబడుచుండెను.

• •

ఇట్లు క్రొత్తప్రదేశమునఁ గ్రొత్త యుద్యమములలో విమగ్నయైయున్న పార్వతి యొకవిధముగ క్రొత్త మానిసి యయ్యెననియే చెప్పవచ్చును.

ఈనూతనజీవితమున పార్వతి కెంతో మేలు కలిగెను. ఇట్టిమార్పు లేక, జననీజనకులయొద్దనే యాబాల దినములు గడుపనెంచినయెడల, దినమొక యేఁడుగా నామెకుఁ గాన్పించియుండును. పరోపకారదీక్షయే, మనఃక్లేశనివారకమును, ఆత్మోజ్జీవన సమర్థమును! కావుననె తాను ధన్యజీవితనని పార్వతి యిపుడు తలంచి, యీపరిణామమునకుఁ గారణమైన కాలమును, కాలాధిపతియగు నీశ్వరుని వినుతించుచుండును.

ఐనను, ఒక్కొకప్పుడు పార్వతికి వర్ణింపరాని దుఃఖము పొంగిపొరలివచ్చుచుండును. లోకమునఁ దానొంటరిగ నుంటినని యాయబల భీతి నొందుచుండును. తలిదండ్రులు దూరమున నుండుటయు, పతిని వీడి దినములు గడపుటయును—ఇవి యాయంగనకెంతో దుస్సహములుగ నుండెను. పతి ప్రవాసమునకుఁ దానే కారణమని తలంచినపుడామానిని మనోవ్యథ యధికమగుచుండెను. అత్తను గూర్చి తా నాఁడాడిన యన్యాయపుబలుకున కాయింతియెంతయు వగచి, ఆఘోరపాపమునకు పరితప్త యగుచుండును.

నిరతము కార్యదీక్షతో నుండు పార్వతి యిట్టి గూఢదుఃఖమునకు లోనగుచుండునని యెవ్వరికిఁ దెలియును? దుఃఖము పొంగినపుడు, ఆబాల తనగదిలోని శయ్యమీఁదఁజేరి, శమనమైనపిదప వెలికివచ్చును. ఒకానొక దినమున పార్వతి యిట్లు శోకవార్థియందు మునిఁగియుండఁగా అత్త యామెదగ్గఱకువచ్చి, "అమ్మా! నేఁడు నీవేమి యిట్టులున్నావు?" అని యడుగఁగా పార్వతి సత్యము చెప్పవలసివచ్చెను. అంతఁ దనకొమరునివిషయము జ్ఞప్తికివచ్చిన యత్త కోడలితోఁ గలిసి శోకించెను. కాని, తనపుత్త్రుడు అనతికాలములోనె యిలుసేరఁగలఁడని చెప్పి యత్త కోడలి నోదార్చి, ఆమానిని మనస్సు దుఃఖవిషయములందుఁ జొరకుండు నుపాయ మారయుచుండెను.

దేశీయమహాసభ, ఆంధ్రదేశ కేంద్రస్థానమగు కాకినాడను జరుగనున్నదని తెలిసి, పార్వతి, యచటికేగి సభాదినములలో నచటికేతెంచు మహనీయుల సేవజేసి ధన్యత నొందఁ గోరుచున్నానని చెప్పినపుడు, ఇట్టి వ్యావృత్తి వలననైనఁ గోడలిమనసు దుఃఖవిషయములు మఱచుట కలవడునని యత్త తలపోసి, యామె పయనమునకు సమ్మతించెను.

౬. ఉంగరము దొంగతనము

క. తక్షకుఁ డీ కుండలముల
　పేక్షించుచునుండువాఁ డభేద్యుఁడు మాయా
　దక్షుండు, వారివలన, సు
　రక్షితముగఁ జేసి చనుము రవినిభతేజా!

—భారతము.

పార్వతి కాకినాడపురమున నడుగిడుటకుఁ బూర్వమె, ప్రచ్ఛన్నయై యటనుండఁగోరి పేరును వేషమును గొంతయు మార్చుకొనెను. అన్యదేశపు స్త్రీయని తెలుఁగువారు తలంచి, తనను లేనిపోనిప్రశ్నములు వేయకుండుటకై తానీమార్పుచేసికొంటినని పార్వతి యనుకొనుచుండెడిది. కాని యాముదితకుఁ దెలియకయే వేఱొక యుద్దేశముకూడ నామె మానసమున నుండెనేమో!

ఒకనాఁడు ప్రాతఃకాలమున బంగరులేయెండలో తమదుస్తులు మెఱయుచుండఁగ, దేశీయైచ్ఛిక భటులు గాంధినగరమధ్యమున స్థాపింపఁబడనున్న జాతీయపతాకాస్తంభము చుట్టును జేరియుండిరి. పతాకస్థాపనమహోత్సవము దర్శించుటకై వేలకొలది జనులు బారులుదీరి నిలుచుండిరి. ముందరిబాట నిరుప్రక్కలను స్త్రీలు చేరియుండిరి. వీరిలోఁ బార్వతీభాయి యొకతె. అంతసేనానియగు జవహారిలాలుగారి హిందీయుపన్యాసమును తెనుఁగువారి యుపయోగార్థము భాషాంతరముచేసిన యొక యువకుని కంఠస్వరము తానెపుడో వినినట్టుగ పార్వతికిఁ దోఁచెను. కొంతసేపటికి స్ఫురణకువచ్చి, యాయువకునివైపున కాసుందరి దృష్టి నిగుడింపఁగా, గడ్డము మీసమును దట్టముగ నావరించినవదనమామెకు చక్షుర్గోచరమయ్యెను.

కాని, విశ్వనాథమునకంటె నీతఁడు పొడుగుగనుండిన వేఱొక పురుషునివలెఁ దోఁచెను. "ముఖమునుబోలు ముఖ ముండుకీతినేకకంఠమును బోలుకంఠము నుండదా?" యని తన్నుఁదా ప్రశ్నించుకొని, పార్వతీభాయి, తత్తరపడెడి తనహృదయావేగమును శమింపఁజేసికొనెను. ఆజనసమూహమునఁ నొకవేళ తనప్రియుఁడుండినను ఆయననుగనుఁగొనుటెట్లని యామె యధైర్యపడెను. మానవసేవాదీక్షచే నాకోమలి హృదయము బంధింపఁబడి యున్నను, కన్నుగవమాత్రము ప్రియుని సుందరాకార సందర్శనముకొఱకు అపుడపుడు జనసమూహము నారయుచుండునని మానమ్మకము.

కాకినాడలో పార్వతీభాయికిఁ గలిగిన యొకటిరెండనుభవములను గుఱించి యిచటఁ గొంత ప్రస్తావించెదము. మొదటిదినములలో స్వైచ్ఛికసేవకులు సేవకురాండ్రును, గంటికి ఱెప్పవలెఁ సొమ్ము నహర్నిశము గాచుచుందురని యూహించి ప్రేక్షకులు పగలేమఱియుండుటయు రాత్రులు మైమఱచి నిదురించుటయుఁ గనిపెట్టి, చుట్టుపట్టులనుండియు, విదేశములనుండియు,వచ్చిన చోరశిఖామణులు ఇచ్ఛావిహారము సలుపుచుండిరి. కనుమూసి కనుతెఱచునంతలో ప్రజలు తమ సొత్తును గోలుపోవుచుండిరి. తమవస్తువులు క్షణమాత్ర వ్యవధానమున మాయమగుచుండుట కాశ్చర్యపడి, జనులు తమదగ్గఱనున్న నిరపరాధులమీఁదనే నిందమోపుట కారంభించిరి. ఇట్టి యపనిందలుమోప వెనుదీయకుండువారిలో స్త్రీప్రేక్షకులును గలరు. వీరమ్మమీఁద వెంకమ్మయు,సూరమ్మమీఁద పేరమ్మయు లేనిపోని సందియములుపడి, దేశీయ మహాసభాతీర్థయాత్ర చేసినందుకు ఫలముగా, సొమ్ము గోలుపోవుటకుఁదోడు,ఆజన్మవిరోధములు సంపాదించుకొని వెక్కుండ్రు ఇలుసేరిరి! ఏయమ్మ సింగారము గుఱించి యాయమ్మచూచుకొనునుగాని, పరుల సొమ్ము భద్రపఱుపవలయు ననుచింతగలవారు లేకుండిరి. పార్వతీభాయి జాగరూకతగల కన్నులం చిట్టి దొంగతనము లెట్టి పట్టుకొనుచుండుటనుబట్టి, యామె విహరించు దెస దొంగతనము లంతగఁ దలచూపకుండెడివి.

పగలెట్లో పెద్దసొమ్ములను స్త్రీలు గాపాడుకొనఁగలుగుచుండిరికాని, రాత్రులు వారేమి చేయఁగలరు? ఒకనాఁటిరాత్రి స్త్రీప్రతినిధులుండు పెద్దగదిలో గందఱు విశ్రమించి యుండిరి. గదికిగదికి నడ్డముగ దడులు తడకలు నుండుటచేతను, తడకలే తలుపులుగ నమర్పఁబడి యుండుటవలనను, చోరుల బారినుండి లోనివారి కంతరక్షణము లేకుండెను. మినుకుమినుకుమను విద్యుద్దీపములు జనులకంటె చోరులకే యొక్కొకతఱి సహాయకరము లగుచువచ్చెను. దప్పుడైన, ముందరివాకిటు దగ్గఱకుఁ బార్వతిభాయి పోయి యుండుట గనిపెట్టి, వెనుకవాకిలి తడకసందునుండి యొకచోరుఁడు చేయిపోనిచ్చి, అచట మంచముమీఁదఁ బండుకొనియున్న స్త్రీనగను దీసికొన నెంచెను. ఇది కనిపెట్టి పార్వతీభాయి వేగమె యచటికిఁజని, నగమీఁదఁజేయిడిన దొంగచేతి నదిమిపట్టెను. చోరుఁడంత నిద్రించు స్త్రీనగను వదలివైచి, పార్వతీభాయి చేతిని బట్టుకొని, వ్రేలియుంగరమును సంగ్రహించి పరుగిడెను. తనవస్తువుపోయినను,పరులసొమ్ము భద్రమయ్యెనని పార్వతి సంతసించెను. దొంగకై వెతకిరికాని, వానిజాడ గానఁబడలేదు.

తాను బోఁగొట్టుకొనిన సొమ్మధికమైన విలువగలది గాకున్నను, పాపము, పార్వతీభాయి యారాత్రియుఁ బిమ్మటయు ననేకపర్యాయములు తన వట్టివ్రేలిని జూచి దైన్యమునొందెను. పరులచేఁ జిక్కిన యాయమూల్యమగు నుంగర మిఁక దొరకదని గ్రహించి పార్వతి మిక్కిలి విషాద పడెను.